తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

తాడ్వాయిలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఎస్ఆర్ఎన్‌కే కళాశాలలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

లింగంపేట, నవంబర్ 5 : కుల గణనలో తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఎన్యుమరేటర్లకు నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సర్వేపై అనుమానాలు ఉంటే ముందస్తుగానే నివృత్తి చేసుకోవాలని సూచించారు. పూర్తి స్థాయిలో సర్వేలో వివరాలు సేకరించాలని చెప్పారు. ప్రభుత్వ పరంగా అందించిన బుక్‌లెట్ ఆధారంగా గణన చేపట్టాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి పక్కాగా సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలి..

బాన్సువాడ రూరల్, నవంబర్ 5 : ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై శ్రీరాం నారాయణ్‌ఖేడియా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు మంగళవారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతిలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని పలు సూచనలు, సలహాలు అందించారు. గ్రామాల్లో ఒక్క ఇల్లు వదలకుండా సర్వే చేయాలన్నారు. ఈ నెల 6 నుంచి 16 వరకు చేపట్టే సర్వేను వందశాతం పూర్తి చేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. శిక్షణ తరగతిలో మండల ప్రత్యేకాధికారి, డీఈవో రాజు, ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఏఎస్‌వో కిషన్, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల పరిశీలన

కామారెడ్డి, నవంబర్ 5 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో రంగనాథ్ రావు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కామారెడ్డి, నవంబర్ 5 : జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు తనిఖీ చేశారు. 'నమస్తే తెలంగాణ'లో 'బాలామృతంలో పురుగులు' అనే శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అంతకుముందు లబ్ధిదారు ఇంటికి వెళ్లి వారికి ఇచ్చిన బాలామృతాన్ని పరిశీలించారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరగకుండా చూస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ.. బాలామృతం ప్యాకెట్లను పరిశీలించామని, కేవలం ఒక ప్యాకెట్ మాత్రమే అలా వచ్చిందన్నారు. శాంపిళ్లను హైదరాబాద్ ఫుడ్ ఆఫీసర్‌కు పంపిస్తామని తెలిపారు. ఈ తనిఖీలో సపోర్టింగ్ టీచర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

రాజంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

రాజంపేట్/పెద్ద కొడప్‌గల్/గాంధారి, నవంబర్ 5 : రాజంపేట్ మండలంలోని కొండాపూర్, గుండారం, రాజంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్ మంగళవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు చేయాలన్నారు. గోనె సంచులు, హమాలీల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శిల్ప, రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు. పిట్లం మండలం బొలక్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ పరిశీలించారు. ఆయనవెంట ఏఈవో ప్రదీప్‌రెడ్డి, రైతులు ఉన్నారు. గాంధారి మండలం సీతాయిపల్లి గ్రామంలో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఏ పీడీ సురేందర్, ఐకేపీ డీపీఎం రమేశ్‌బాబు వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యంలో తేమ శాతాన్ని ఎప్పటికప్పుడూ పరిశీలించి, వెంటనే తూకం వేయాలని సూచించారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఎల్లారెడ్డి తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5 : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఏబీవీపీ ఎల్లారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, నలంద కళాశాలల విద్యార్థులు కలిసి మంగళవారం ర్యాలీ, ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నా విషయం తెలిసి అక్కడికి వచ్చిన ఆర్డీవో ప్రభాకర్ విద్యార్థులతో మాట్లాడుతూ.. మీరు ఇచ్చిన రిప్రజెంటేషన్‌ను ఉన్నతాధికారులకు అందజేస్తానని హామీ ఇవ్వడంతో శాంతించిన విద్యార్థులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య శిబిరం

నస్రుల్లాబాద్, నవంబర్ 5 : బీర్కూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 30 ఏండ్లు పైబడిన మహిళలకు మహిళా ఆరోగ్య శిబిరం నిర్వహించారు. మహిళలకు క్యాన్సర్, థైరాయిడ్, గర్భకోశ, మూత్రకోశ వ్యాధులకు సంబంధించి పరీక్షించి మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారిణి శ్రీలేఖ, సీహెచ్‌వో రవీందర్, ఎంఎల్‌హెచ్‌పీలు ప్రీతి, సాగర్, సూపర్‌వైజర్ నర్సమ్మ, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఏలు, పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్ ఉపాధ్యాయుల సంఘం

కామారెడ్డి, నవంబర్ 5 : డీఏలు, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని తపస్ బాధ్యులు అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల నాలుగు డీఏలు, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, పీఆర్సీని వెంటనే అమలు చేయాలని అన్నారు. సీపీఎస్‌ను తొలగించి ఓపీఎస్ అమలు చేయాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించలేని పక్షంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పులగం రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంతోష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీంద్రనాథ్, రాష్ట్ర బాధ్యులు రామచందర్, భాస్కరాచారి, జిల్లా బాధ్యులు లక్ష్మీపతి, ఆంజనేయులు, శివకాంత్, వేద ప్రకాశ్, సంతోష్, భాస్కర్, ఆనంద్, దత్తాచారి, సంగమేశ్వర్‌గౌడ్, శ్యాంసుందర్, మధు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించాలని వినతి

బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహ్మద్‌నగర్, బూర్గుల్ గ్రామాల ప్రజలు

బాన్సువాడ, నవంబర్ 5 : బాన్సువాడ డివిజన్‌లోని మహ్మద్‌నగర్ మండల కేంద్రం ప్రజలు నేషనల్ హైవే రోడ్డులో తమ భూములు కోల్పోతున్నామని, ఆ భూములు, స్థలాలకు మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. తమకు ఉన్న స్థలాలు కోల్పోతున్నామని మహ్మద్‌గనర్, బూర్గుల్ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఎకరానికి రూ.30 లక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్ గుప్తా, రాము, దుబ్బ నాగరాజు, ప్రవీణ్, చింతల సంతోష్. నరేశ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

మాచారెడ్డి, నవంబర్ 5 : పాల్వంచ మండలంలోని ఇసాయిపేట గ్రామానికి చెందిన ఐండ్ల విష్ణు సౌదీఅరేబియాలో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి అన్సాబ్ కంపెనీకి చెందిన పాలమాకుల స్వామిగౌడ్, శేఖర్‌గౌడ్, అవుసూనురి చంద్రం, మరికొంత మంది కలిసి రూ.3 లక్షల ఎనిమిది వేలు జమ చేశారు. బుస అశోక్ ద్వారా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి విష్ణు భార్యకు బాండ్‌ను అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన వారికి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యాధికారిణి దివ్య

భిక్కనూరు, నవంబర్ 5 : ఆశ వర్కర్లు అంకిత భావంతో పనిచేయాలని భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి దివ్య తెలిపారు. మంగళవారం ఆశ డేను పురస్కరించుకొని ప్రభుత్వ దవాఖానలో బేటీ బచావో బేటీ పడావో అంటూ ఆడపిల్లల ఆవశ్యకత, వారి ప్రముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మహిళలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గర్భిణులకు సకాలంలో వైద్యం, పౌష్టికాహారం అందేలా చూడాలని అవగాహన కల్పించారు.

విజయ పాల డెయిరీ నూతన కమిటీ ఎన్నిక

తలమడ్ల విజయ పాలడెయిరీకి నూతనంగా ఎన్నికైన సభ్యులు

రాజంపేట్, నవంబర్ 5 : మండలంలోని తలమడ్ల గ్రామంలో విజయ పాల డెయిరీ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజిరెడ్డి, డైరెక్టర్లుగా పండరి, నర్సింహారెడ్డి, గంగిరెడ్డి, ఆంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, బాల్ రెడ్డి, నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కాలభైరవస్వామి ఆలయంలో

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రత్యేక పూజలు

ఆలయంలో పూజారులతో ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ

రామారెడ్డి, నవంబర్ 5 : మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కాలభైరవస్వామిని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం దర్శించుకున్నారు ఆలయంలో స్వామివారి విగ్రహానికి జలాభిషేకంతోపాటు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కాలభైరవ హోమం లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ఈవో ప్రభురాంచంద్రం ఆయనకు స్వామి వారి చిత్రపటం అందజేసి శాలువాతో సన్మానించారు. పండితులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు ఇచ్చి వేద ఆశీర్వచనం చేశారు.

కుల గణన సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఎల్లారెడ్డి పాఠశాలలో కులగణనపై శిక్షణ క్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో

నమస్తే తెలంగాణ యంత్రాంగం, నవంబర్ 5: కుల గణన సర్వేను ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని నాగిరెడ్డిపేట మండల ప్రత్యేక అధికారిణి రత్నం అన్నారు. మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలోఎంపీఎస్‌వో స్వాతి, ఎంపీడీవో ప్రభాకర్, ఎం ఈవో భాస్కర్ తదితరులున్నారు. గాంధారిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎల్లారెడ్డిలోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో ఆర్డీవో ప్రభాకర్ ఎన్యుమరేటర్లకు సర్వేపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్, గిర్దావర్ శ్రీనివాస్, మాస్టర్ ట్రయినర్లు శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఎంఈవో వెంకటేశం తదితరులున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కులగణన ప్రారంభించడం హర్షణీయమని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్ద కొడప్‌గల్‌లోని రైతు వేదికలో ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, నిజాంసాగర్‌లో ఇంటింటి సర్వేపై శిక్షణ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి తిరుమలప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ తహసీల్దార్లు భిక్షపతి, సవాయిసింగ్, ఎంఈవోలు తిరుపతిరెడ్డి, అమర్ సింగ్ పాల్గొన్నారు. లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికీ ముందుగా స్టిక్కర్ అంటించాలని ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ సూచించారు. సదాశివనగర్‌లోని రైతు వేదికలో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సర్వేపై ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్, ఎంపీవో సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న కులగణన సంప్రదింపుల సదస్సులో జుక్కల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్ సౌదాగర్ అరవింద్ పాల్గొన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి చర్చించారు. నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లోని రైతువేదిక భవనంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సమగ్ర ఇంటింటి సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి దయానంద్, ఎంఈవో చందర్, ఎంపీడీవో సూర్యకాంత్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. రాజంపేటలోని రైతు వేదికలో సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి అపర్ణ, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, ఎంఈవో పూర్ణచందర్‌రావు, టీవోటీ ప్రకాశ్ పాల్గొన్నారు. కామారెడ్డి మండల పరిషత్ కార్యాలయంలో సర్వేపై అవగాహన కల్పించినట్లు ఆర్డీవో రంగనాథ్ తెలిపారు. సమావేశంలో ఎంఈవో ఎల్లయ్య, ఎంపీవో హెబ్బిబారాణి, పంచాయతీరాజ్ ఏఈ, ఏపీఎం, ఏపీవోలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

నిజాంసాగర్, నవంబర్ 5 : మహ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, వ్యవసాయ విస్తీర్ణధికారి మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ చైతన్య స్ఫూర్తి.. దాశరథి

ఎల్లారెడ్డి కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 05: నిజాం నిరంకుశ పాలనను ధిక్కరించిన కవి యోధుడు, తెలంగాణ చైతన్యానికి ప్రతీక దాశరథి కృష్ణమాచార్య అని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాకవి దాశరథి వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జైలు శిక్ష అనుభవిస్తూనే నా తెలంగాణ కోటి రతనాల వీణ అని జైలు గోడలపై పద్యాలు రాసిన ధీరుడు అని కొనియాడారు. విద్యార్థులు ఆ మహాకవిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

కూలిన కంపోస్ట్ షెడ్డు పరిశీలన

పెద్ద కొడప్‌గల్, నవంబర్ 5: మండలంలోని బుర్గుపల్లి గ్రామంలో భారీ వర్షాలు, ఈదురు గాలులకు కూలిన కంపోస్ట్ షెడ్డును మంగళవారం జేపీసీఈవో చందర్ నాయక్ పరిశీలించారు. షెడ్డు మరమ్మతుల కోసం కలెక్టర్‌కు నివేదికను పంపించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి,ఏపీవో సుదర్శన్,పంచాయితీ కార్యదర్శి సాయిలు,తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు

నాగిరెడ్డిపేట, నవంబర్ 5: మండలంలోని గోలిలింగాల ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం జిల్లా సెక్టోరియల్ అధికారులు వేణుగోపాల్, వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వారి సామర్థ్యాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. వారి వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దేవయ్య, గోపాల్‌పేట ఉన్నత పాఠశాల కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి, సీఆర్‌పీ రాజు ఉన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బిచ్కుంద, నవంబర్ 5: సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై ప్రభాకర్ అన్నారు. మంగళవారం జుక్కల్ మండలంలోని బాలాజీనగర్ వద్ద ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది దత్తురావు, కలీమ్, నరేందర్ రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

'లింగనిర్ధారణ చట్టవిరుద్ధం'

లింగంపేట, నవంబర్ 5: గర్భిణులో లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని, గ్రామీణ ప్రాంతాల వారికి అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారిణి హిమబిందు సూచించారు. లింగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అంబేద్కర్ యువజన సంఘం కమిటీ ఎన్నిక

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5: మండలంలోని దావల్‌మల్కపల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని సోమవారం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎల్లారెడ్డిలో కంటి పరీక్షలు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5: ఎల్లారెడ్డి పట్టణంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం, మెడివిజన్ హైదరాబాద్, మాసాబ్‌టాంక్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయ ఫంక్షన్ హాల్‌లో 140 మందికి పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కంటి ఆపరేషన్‌కు వచ్చిన వారికి ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి భోజనాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అకుల కిష్టయ్య, సెక్రటరీ కృష్ణమూర్తి, కోశాధికారి నర్సింహారావు, ప్రచార కార్యదర్శి శంకర్, దవాఖాన సిబ్బంది ఉన్నారు.

ప్రజల సమస్యలు తీర్చడమే లక్ష్యం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5: తాను ఉండే నాలుగు నెలల్లో పట్టణంలోని ప్రజల సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించడమే తన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం ఎల్లారెడి పట్టణంలోని 8,10వ వార్డుల పరిధిలోని పద్మశాలీ సంఘం నుంచి డెయిలీ మార్కెట్‌కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు వేయకుండా మిగిలి ఉన్న చిన్నపాటి బిట్టుకు సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. 10వ వార్డులోని గల్లీలో సీసీ రోడ్డు వేయడానికి పరిస్థితిని సమీక్షించారు. ఆయనతోపాటు వార్డు కౌన్సిలర్ నీలకంఠం అప్ప, నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి హామీ

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 5: ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బాత్‌రూంలు, మరుగుదొడ్లను నిర్మింపజేస్తానని శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనతోపాటు నాగిరెడ్డిపేట్ మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, నాయకులు ఉన్నారు.

సిమెంట్ బస్తాల అందజేత..

పట్టణంలోని 1వ వార్డు ఎర్రమన్నుకుచ్చలో ఉన్న బ్రహ్మంగారి మందిరానికి శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి 300 బస్తాల సిమెంట్ అందజేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

రామారెడ్డి, నవంబర్ 5: మండలంలోని పోసానిపేట్ గ్రామంలో మూడు రోజుల నుంచి నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఖోఖో బాలికల అండర్-14 పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ క్రీడల్లో ప్రథమ స్థానంలో ఆదిలాబాద్, ద్వితీయ స్థానంలో రంగారెడ్డి, తృతీయ స్థానంలో నిజామాబాద్ జట్లు నిలిచాయి. జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి విజేతలకు ట్రోఫీ అందజేశారు.

విద్యార్థినులకు కరాటే తరగతులు

నాగిరెడ్డిపేట, నవంబర్ 5: మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం కరాటే తరగతులు ప్రారంభించినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకట్రాంరెడ్డి తెలిపారు. విద్యార్థినులకు విద్యతో పాటు ఆత్మరక్షణకు కరాటే అవసరమని, వారంలో రెండు రోజులు తరగతులను మండల కేంద్రానికి చెందిన కరాటే మాస్టర్ యాదగిరి ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు చెప్పారు.

సరైన ధ్రువ పత్రాలు లేని వెండివస్తువుల స్వాధీనం

బిచ్కుంద, నవంబర్ 5 : సరైన ధ్రువ పత్రాలు లేని 8.59కిలోల వెండి వస్తువులను బిచ్కుంద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. నిజామాబాద్ నుంచి కళ్యాణ్ అనే వ్యక్తి బిచ్కుందలోని గాంధీ చౌక్ లో ఉన్న గోల్డ్ షాప్ వద్దకు సరైన ధ్రువ పత్రాలు లేకుండా వెండి వస్తువులు తీసుకు వస్తున్నాడన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఏపీ01ఏబీ6342 నెంబర్‌గల కారును తనిఖీ చేయగా అతని వద్దనుంచి సరైన ధ్రువపత్రాలు లేని 8.59కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసి ట్రేజరీలో డిపాజిట్ చేయడం జరిగిందని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

బిచ్కుంద, నవంబర్ 5: బిచ్కుంద సర్కిల్ పరిధిలోని పేకాట ఆడుతున్న 206 మందిని అరెస్టు చేసినట్లు సీఐ నరేశ్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

లింగంపేట(తాడ్వాయి), నవంబర్ 5: తాడ్వాయి మండలంలోని దేవాయిపల్లి గ్రామానికి చెందిన టేకుల సాయిరెడ్డి (55) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. సాయిరెడ్డి సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించారు. సాయిరెడ్డి చిన్న కుమారుడు గృహనిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చకుండానే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులతో చర్చించినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు నిద్రించిన అనంతరం సాయిరెడ్డి, ఎదురుగా ఉన్న పాత నివాస గృహంలో నైలన్ తాడుతో ఉరి వేసుకున్నాడన్నారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి విచారణ చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

బాలుడిపై పోక్సో కేసు నమోదు

నాగిరెడ్డిపేట, నవంబర్ 5: మండలంలోని ఓ బాలుడిపై పో